'స్నేహపురి' సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా వినోద్‌యాదవ్



వినోద్ యాదవ్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి

మోతీనగర్: మూసాపేట డివిజన్ స్నేహపురి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్ష పదవికి ఎన్నికలు ఆదివారం స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయ ఆవరణలోని సంక్షేమ సంఘం కార్యాలయంలో జరిగాయి. కె. నారాయణ రెడ్డిపై వినోద్ యాదవ్ అధ్యక్షుడిగా గెలుపొందారని ఎన్నికల అధికారి సంఘం సురేందర్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా వినోద్ యాదవ్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను గతంలో చేసిన అభివృద్ధి పనులే తిరిగి తన విజయానికి దోహదపడ్డాయని తెలిపారు. అందరి సహకారంతో కాలనీని మరింత అభివృద్ధి చేస్తానన్నారు.

మోతీనగర్ చౌరస్తాలో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన రాజేశ్వరరావు తదితరులు

మోతీనగర్: మోతీనగర్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ మాజీ అధ్యక్షులు ఎస్. అంజిరెడ్డి, మోతీనగర్ సీనియర్స్ సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు చౌరస్తాలో ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా బైక్ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ

మాదాపూర్: మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వరల్డ్ కిడ్నీడే సందర్భంగా బైక్ ర్యాలీని ఆదివారం నిర్వహించారు. మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ సత్యానారాయణ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కమల్‌కిరణ్ మాట్లాడుతూ.. దేశంలో దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయన్నారు. మూత్రపిండాలకు ముందస్తు పరీక్షలు చేయించుకొండి అనే థీమ్‌తో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. నెఫ్రాలజిస్ట్ డాక్టర్ అరుణ్‌కుమార్, చీఫ్ ఆఫ్ బిజినెస్ ఆపరేషన్స్ మహేష్ దెగుల్కర్ తదితరులు పాల్గొన్నారు.

20,21 తేదీలలో కల్చరల్, స్పోర్ట్స్ ఫెస్ట్

రాయదుర్గం: గచ్చిబౌలిలోని 'నిథమ్' ప్రాంగణంలో నిథ్మాదిత్యం' పేరిట ప్రత్యేక ఇంటర్‌కాలేజ్ కల్చరల్, స్పోర్ట్స్ ఫెస్ట్-2025 నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 20,21 తేదీలలో ఈ ఫెస్ట్‌ను నిర్వహిస్తారు. నగరంలో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులకు ఈ పోటీలలో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తారు. ఆయా విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు తమలోని క్రీడా, సాంస్కృతిక నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఈ పోటీలు ఎంతో ఉపయుక్తంగా మారనున్నాయి. పూర్తి వివరాలకు 95738 32289, 9553700031 నెంబర్లకు ఫోన్ చేయవచ్చు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మాదాపూర్: మాదాపూర్‌లో గుర్తుతెలియని వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. మాదాపూర్ పోలీసులు తెలిపిన మేరకు.. ఉదయం 10 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని మృతదేహాన్ని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

జేఏసీ ఆధ్వర్యంలో హెచ్‌సీయూలో నిరసన

రాయదుర్గం: హెచ్‌సీయూలో నూతనంగా భూపోరాటం కోసం ఏర్పడిన జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి భారీ నిరసన తెలిపారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లోని నార్త్ గేట్ వద్ద విద్యార్థులు, టీచింగ్, నాన్‌టీచింగ్, వర్కర్స్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ప్రభుత్వం జారీ చేసిన ప్రెస్ రిలీజ్ కాపీలను దహనం చేశారు.

మూసాపేట ధోబీఘాట్ వెనుక భాగంలో పైపులైన్ ద్వారా నీటిని ట్యాంకర్‌లో నింపుతున్న వ్యాపారులు



తోడేస్తున్నారు.. సొమ్ము చేసుకుంటున్నారు!

జోరుగా నీటి వ్యాపారం
- చెరువులు, నాలాలే కాక ఇళ్లలో కూడా బోర్లు వేసి విక్రయం
- ఇష్టానుసారంగా బోర్లు
- పట్టించుకోని అధికారులు

అసలే ఎండా కాలం. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఎండలు పెరుగుతుండటంతో నీటి వ్యాపారం జోరందుకుంది. నీటిని తోడేస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. చెరువులను ఆసరాగా చేసుకొని అక్రమంగా బోర్లు వేసి అక్రమంగా సంపాదిస్తున్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని కాముని చెరువు, మైసమ్మ చెరువు, సున్నం చెరువు, నాలాలకు ఆనుకొని బోర్లు వేసి జలగలు రక్తాన్ని పీల్చినట్లు నీటిని పీల్చేస్తున్నారు. అయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

మూసాపేట/మోతీనగర్: చెరువులు, నాలాలే కాక ఇళ్లల్లో కూడా బోర్లు వేసి నీటి మాఫియా నీటిని పీల్చేస్తుంది. కాముని చెరువు క్రింది భాగంలో ఉన్న ఇళ్లల్లో బోర్లు వేసి పైపులైన్‌లను చెరువులో నుంచి తీసుకువచ్చి నీటిని విక్రయిస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉండటంతో ఈ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. బోర్లు తవ్వి నిత్యం వేలాది ట్యాంకర్లతో నీటిని అమ్ముకుంటు కోట్లు గడిస్తున్నారు.



కాముని చెరువు కింది భాగంలో అల్లాపూర్ ఇ బ్లాక్ ఇళ్లల్లో బోర్లు వేసి చెరువులో నుంచి వేసిన పైపులైన్లు

ఇళ్లల్లో బోర్లు వేసి నీటి విక్రయం

కాముని చెరువు సమీపంలోని సఫ్దార్‌నగర్, చెరువు క్రింది భాగంలో ఉన్న ఇళ్లల్లో అక్రమంగా బోర్లు వేసి నీటిని తోడేస్తున్నారు. బోర్లు వేసిన యజమానులకు కిరాయి చెల్లిస్తూ నీటిని వివిధ హోటల్స్, హాస్టల్స్, రెస్టారెంట్‌లలో ట్యాంకర్ల ద్వారా అమ్ముకుంటున్నారు. కాముని చెరువు ప్రాంతంలోనే సుమారు 200 బోర్లు వేసి ఉండవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు. కైత్లాపూర్ బ్రిడ్జి క్రింద, మూసాపేటలోని పెట్రోల్ బంక్ వెనుక దోబీ ఘాట్ సమీపంలో చెరువులో బోర్లు వేసి పైపులైన్ ద్వారా నీటిని ట్యాంకర్లలో నింపి విక్రయిస్తున్నారు. కాముని చెరువు కట్టపైనే వాటర్ ప్లాంట్ నడుస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. కైత్లాపూర్ బ్రిడ్జి నుంచి జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లకు వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా అక్రమంగా బోర్లు వేసి నీటిని తోడుతున్నారు. ఈ ఒక్క దారిలోనే సుమారు 20 నుంచి 30 వాటర్ ట్యాంకర్‌లు నింపే కేంద్రాలు ఉన్నాయి. ఒక్కొక్క కేంద్రం నుంచి సుమారు ప్రతి రోజూ 30 ట్యాంకర్ల వరకు నీటిని సరఫరా చేస్తున్నారు. ఒక బోరు ఎండిపోతే సమీపంలోనే మరో బోరు వేస్తూ నీటి దందాను నడిపిస్తున్నారు.

గుంతలు తవ్వి.. పాలిథిన్ కవర్ వేసి..

భారీ గుంత తవ్వి పాలిథిన్ కవర్ వేసి నీటిని స్టోరేజ్ చేసి విక్రయిస్తున్నారు. ఆ కవర్‌లో నీరు పాచిపట్టి, పురుగులు పట్టి, కలుషితంగా ఉన్నా అలాగే విక్రయిస్తున్నారు. ఈ ప్రాంతంలోనే వాటర్ ప్లాంట్‌లు కూడా భారీ ఎత్తున ఏర్పాటు చేశారు. అదే విధంగా భరత్‌నగర్ కాలనీ కూరగాయల మార్కెట్ బ్రిడ్జి సమీపంలో జింకలవాడకు వెళ్లే దారిలో హుస్సేన్ సాగర్‌కు వెళ్లే నాలాలో బోర్లు వేసి నీటిని విక్రయిస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా ఇదంతా జోరుగా జరుగుతున్న అధికారుల్లో మాత్రం చలనం లేదు. కలుషిత నీటిని విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవంతో అధికారులు మామూళ్ల మత్తులో ఉన్నారా? అని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం వేసవి కాలంలోనే ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్వయంగా అధికారులతో కలిసి బోర్లను పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వాటిని తీసివేయటమే కాకుండా వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అయినా నీటి మాఫియా మళ్లీ బోర్లను ప్రారంభించి నీటిని విక్రయిస్తూ కోట్లు గడిస్తున్నారు.



కైత్లాపూర్‌లో ..


మెడికల్ క్యాంపు నిర్వహించడం అభినందనీయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డులోని హోలిస్టిక్ హాస్పిటల్‌లో తెలంగాణ, ఒడిశా డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ క్యాంప్‌ను హాస్పిటల్ చైర్మన్ రాంచందర్, డాక్టర్ రవిశంకర్‌తో కలిసి పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెడికల్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి మొదటి, మూడవ ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత మెగా హెల్త్ క్యాంప్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఒడిశా డాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ నిహార్ ప్రధాన, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ అనురాధ పాండా, సెక్రటరీ డాక్టర్ కలిల్, డాక్టర్ సునీల్ స్వైన్, నాయకులు దామోదర్ రెడ్డి, ఎండీ ఇబ్రహీం, అష్రాఫ్, వైద్య సిబ్బంది సునీత, కాలనీ వాసులు, మహిళలు పాల్గొన్నారు.

అంధకారంలో భవానీ నగర్





విద్యుత్ లైట్లు వెలగక అంధకారంలో ఉన్న భవానీ నగర్‌లోని పలు వీధులు

మరమ్మతులకు నోచుకోని వీధి లైట్లు

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని భవానీ నగర్ అంధకారంలో ఉంది. కాలనీలోని పలు వీధుల్లో విద్యుత్ దీపాలు వెలగక వారు చీకట్లో మగ్గుతున్నారు. వారం క్రితం కాలనీలోని ఓ విద్యుత్ స్తంభానికి షార్ట్ సర్క్యూట్ కావటంతో విద్యుత్ వైర్లు కాలిపోయాయి. అంతేకాకుండా కాలనీలో ఉన్న వీధి లైట్లు కాలిపోయాయి. వాటికి మరమ్మతులు చేయకపోవడంతో వారం నుంచి చీకట్లు అలుముకున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేయటంతో కాలిపోయిన విద్యుత్ స్తంభానికి మాత్రం మరమ్మతులు చేసి మిగిలిన వెలగని లైట్ల స్థానంలో కొత్త లైట్లను ఏర్పాటు చేయలేదు. ఈ కాలనీ నుంచి సత్యసాయినగర్, హెచ్‌పీ రోడ్డు, వేంకటేశ్వరనగర్, ప్రశాంత్‌నగర్‌లకు ఇదే ప్రధాన రహదారి. లైట్లు లేక రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి లైట్లకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

దుండిగల్ రైతులకు అండగా ఉంటా

- అక్రమంగా తీసుకోవాలని యత్నిస్తే ఊరుకోం
- ఎంపీ ఈటల రాజేందర్



రైతులతో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

దుండిగల్: రైతుల భూములను అక్రమంగా గుంజుకునేందుకు యత్నిస్తే ఊరుకునేది లేదని, హైకోర్టు ద్వారా వారికి న్యాయం జరిగేలా చూస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. దుండిగల్ గ్రామ సర్వే నంబర్లు 453, 454 లలో భూములున్న 64 మంది రైతులకు ప్రభుత్వం నోటీసులు అందిన నేపథ్యంలో ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి ఆధ్వర్యంలో సదరు రైతులతో ఎంపీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానన్నారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఆర్టీఏ కు ఇచ్చిన భూములను సర్వే చేయిస్తానని ఎంపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విగ్నేశ్వర్, దుండిగల్ మున్సిపల్ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ ఆకుల విజయ్‌సాయి, సోషల్ మీడియా కో కన్వీనర్ భాను ప్రసాద్, ఆకుల యశ్వంత్, తల్లారి రాజ్ కుమార్, పండుగ శ్రీశైలం, రైతులు పిట్ల సత్యనారాయణ, లక్ష్మణ్, చిన్నంగి మల్లేశం, మహేష్ కుమార్, విష్ణుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని డైమండ్ హైట్స్‌లో వెలిసిన లక్ష్మీగణపతి దేవాలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్వామి ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు.



పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సీఎం రిలీఫ్‌ఫండ్ ఎల్‌వోసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఆదివారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో సుభాష్‌నగర్ ప్రాంతానికి చెందిన మైలరాం భార్గవికి రూ.1.25 లక్షలు, గాజులరామారం ప్రాంతానికి చెందిన షాజత్ బేగంకు రూ.2 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ పత్రాలను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న నిరుపేదలకు ఆర్థిక భద్రతనిచ్చేది, ఆరోగ్య భరోసానిచ్చేది సీఎం రిలీఫ్ ఫండ్ అని అన్నారు. కార్యక్రమంలో సుభాష్ నగర్ డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, బీఆర్ఎస్ నాయకులు గుబ్బల లక్ష్మీ నారాయణ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో అన్నదానం

మోతీనగర్: ఆకలితో అలమటిస్తున్న అభాగ్యులకు పట్టెడన్నం పెట్టడమే జీవితానికి సార్థకత లభిస్తుందని ఎంసీహెచ్‌ఎస్ మాజీ అధ్యక్షులు బిజముల్ల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మోతీనగర్ సీనియర్ సిటిజన్ కౌన్సిలింగ్ ఫోరం ఆధ్వర్యంలో ఎర్రగడ్డ మానసిక ప్రభుత్వ ఆసుపత్రి రోగులు, వారి సహాయకులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్స్ కౌన్సిలింగ్ ఫోరం ఆధ్వర్యంలో ప్రతి నెలలో ఐదుసార్లు అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు. దాత, రిటైర్డ్ అసిస్టెంట్ సెక్రటరీ రంగమని సౌజన్యంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో బ్రాహ్మనంద రెడ్డి, వెంకట్‌నారాయణ, రంగమని తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన వారితో బండి రమేష్ తదితరులు

బాలానగర్: కూకట్‌పల్లి నియోజకవర్గం ఫతేనగర్ డివిజన్‌లోని పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమన్వయంతో ముందుకు వెళ్తూ పార్టీని మరింత అభివృద్ధి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, పుష్పారెడ్డి, డివిజన్ నాయకులు, యూత్ నాయకుల పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్ శిల్పారామంలో వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం భరతనాట్యం, కూచిపూడి, సంగీత కచేరీలు సందర్శకులను అలరించారు. చెన్నైకి చెందిన కళాకారిణి వర్షరాజ్‌కుమార్ భరత నాట్య ప్రదర్శన ఇవ్వగా స్నేహ రాంచందర్ శిష్యబృందం సంగీత కచేరి ఇచ్చింది.

– మాదాపూర్



భగ్గుమన్న కాంగ్రెస్

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనం
- పెద్ద ఎత్తున పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు
- స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్



రిక్షాపుల్లర్స్ కాలనీలో నాయినేని చంద్రకాంత్‌రావు ఆధ్వర్యంలో..



జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలోని గుడ్‌విల్ హోటల్ చౌరస్తాలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివారం ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మారెళ్ల శ్రీనివాసరావు, దొడ్ల రామకృష్ణ గౌడ్, సూర్యవంశీ, రాజా, శ్రీనివాస్, గోపాల్, సుజాత, నారాయణ, భాగ్యరాజ్, కలీం, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందనగర్ డివిజన్‌లో..

డివిజన్ పరిధిలోని రిక్షాపుల్లర్స్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నాయినేని చంద్రకాంత్ రావు ఆధ్వర్యంలో జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకుముందు స్థానికంగా ఉన్న అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన జగదీష్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు చిరుమర్తి రాజు, లింగం, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాలానగర్ శోభన సెంటర్‌లో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బండి రమేష్, హరివర్ధన్ రెడ్డి

అధికారం కోల్పోవడంతో..

బాలానగర్: అధికారం కోల్పోవడంతో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు మతి భ్రమించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. స్పీకర్‌పై మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ ఆయన దిష్టిబొమ్మను బాలానగర్ శోభన సెంటర్‌లో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత స్థాయిలో ఉన్నవారు గౌరవ మర్యాదలు ఇచ్చి పుచ్చుకోవాలన్నారు. అనంతరం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. దళిత స్పీకర్‌ని ఉద్దేశించి జగదీష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు, మార్కెటింగ్, ఆలయ కమిటీ మెంబర్లు, బ్లాక్ అధ్యక్షులు, బ్లాక్ మహిళా అధ్యక్షురాలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటాపోటీ నిరసన..

బీఆర్ఎస్ శ్రేణుల అరెస్టు



రిక్షా పుల్లర్స్ కాలనీ పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఆల్విన్‌కాలనీ: అసెంబ్లీలో ప్రజల పక్షాన ప్రశ్నించినందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి సస్పెన్షన్‌ను వ్యతిరేకిస్తూ ఆదివారం వివేకానందనగర్ డివిజన్, రిక్షాపుల్లర్స్ కాలనీలో బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే ప్రాంతంలో కాంగ్రెస్ శ్రేణులు జగదీష్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తుండటంతో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. పోలీసులు జోక్యం చేసుకొని బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చేసిన నిరసనకు మాత్రం పోలీసులు అనుమతి ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ శాంతియుత నిరసనను పోలీసులు అడ్డుకోవడం సిగ్గు చేటన్నారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో భాస్కర్, భద్రయ్య, ఆంజనేయులు, బాబు, సత్యనారాయణ, యశ్వంత్, జగదీష్ గౌడ్, బాబు, ప్రవీణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.